భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 35.0

కనిష్ఠం : 20.0

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6:20 (మంగళ)

సహరి : 4:51 (బుధ)

తపనా.. సుజనా?

బీజేపీ : ఏలూరు ఎంపీ బరిలో నిలిచేదెవరు ?

- ఉమ్మడి అభ్యర్థిగా ఎవరనేదే అందరి ప్రశ్న
- రాష్ట్రస్థాయి పరిణామాలపైనా నేతల ఆరా
- రెండ్రోజుల్లో తేలబోతుందన్న సీనియర్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)





ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో పట్టుజారకుండా కమలం కసరత్తు సుదీర్ఘంగా సాగుతోంది. పొత్తులో భాగంగా తమకు కేటాయించిన స్థానాల సంఖ్య విషయంలో రాజీపడకుండా తొలి అడుగువేసిన బీజేపీ, తాము ఆశించిన స్థానాల విషయంలో ఎక్కడా వెనుకడుగు వేయడం లేదు. ఉమ్మడి పశ్చిమలో ఏలూరు, నరసాపురం లోక్‌సభా స్థానాల్లో తమకు కేటాయించే స్థానంపై సోమవారం సుదీర్ఘ కసరత్తు నెరపింది. బీజేపీ జాతీయ నేతలు అటు పవన్‌తో ఇటు టీడీపీ అధినేత చంద్రబాబుతో సుదీర్ఘ మంతనాలు కొనసాగిస్తున్నారు. ఒకవేళ మార్పులు చేర్పుల్లో భాగంగా ఒక పార్లమెంట్ స్థానం బదులుగా మరో స్థానం కేటాయిస్తే ఆ మేర కోల్పోయిన స్థానంలో అసెంబ్లీ సీటును కోరుకుంటున్నట్టు సమాచారం. ఇప్పటికే కమలం పార్టీలో కేడర్ అంతా ఉత్కంఠతో ఉంది. తమ పార్టీ గతంకంటే బలోపేతమైందని, దీనికి తగ్గట్టుగానే పోటీ ఉండాలని భావిస్తోంది.

ఎవరి వైపు మొగ్గు

ఏలూరు లోక్‌సభ స్థానం ఆశిస్తున్న బీజేపీ చివరిక్షణం వరకు పట్టు విడవకుండా వ్యూహాత్మకంగానే ముందడుగు వేస్తోంది. ఈ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, (తపన చౌదరి) పోటీకి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. సేవా కార్యక్రమాలను విస్తరించి తపన ఫౌండేషన్ ద్వారా ప్రజలకు చేరువకావడం ద్వారా వచ్చే ఎన్నికల్లో బీజేపీ పక్షాన ఎంపీగా పోటీ చేయాలని ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఏలూరు నగరంతో సహా ముఖ్య పట్టణాలన్నింటిలోనూ ఆయనకు వ్యక్తిగతంగా ఇమేజ్ పెరిగింది. మరోవైపు తపన చౌదరితోపాటు కొన్నాళ్లుగా మాజీ ఎంపీ సుజనాచౌదరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ ప్రచారంతో తపన అభ్యర్థిత్వాన్ని కోరుతున్న వారంతా గందరగోళంలో పడ్డారు. ఆరెస్సెస్ పరివార్ తపనవైపే మొగ్గు చూపుతుండగా, సుజన తెరముందుకు వచ్చారు. సుజనాను నేరుగా వ్యతిరేకించకుండా, తపన చౌదరి పక్షాన మొగ్గు చూపడం ఇంకో పరిణామం. జనసేన వర్గాలు చాన్నాళ్లుగా తపనతో సన్నిహిత సంబంధాలు కలిగి వున్నారు. ఒకవేళ నరసాపురం లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తే ఏలూరు లోక్‌సభ స్థానాన్ని బీజేపీ వదులు కోవాల్సి వస్తుందేమోనన్న టెన్షన్ లోనే పార్టీ శ్రేణులన్నీ వున్నాయి. 'సాధ్యమైనంత మేర ఏలూరు నుంచి పోటీకి వీలుగా తపన చౌదరికే పార్టీ అవకాశం ఇస్తుందని భావిస్తున్నాం' అత్యధికుల భావన ఇది. తపన చౌదరి వచ్చే ఎన్నికల్లో పోటీకి వీలుగా ప్రచార సామగ్రిని సోమవారం సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. బయట ఎంత ప్రచారం సాగుతున్నా, తర్జన భర్జనలు కొనసాగుతున్నా, వీటిని పట్టించుకోకుండా ఏలూరు లోక్‌సభ నుంచే తన పోటీ ఉంటుందని ధీమా వ్యక్తం చేస్తూ తన అనుచర వర్గం, పార్టీ కార్యకర్తలకు ఎన్నికల పనులను పురమాయిస్తున్నారు. ఏలూరు సీటు ఎవరికి దక్కుతుందనేది ఒకటి, రెండు రోజుల్లో తేలిపోనుంది.

నేడు జనసేనలోకి అంజిబాబు

భీమవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) పార్టీలో చేరనున్నారు. భీమవరం నుంచి జనసేన నాయకులతో కలిసి మంగళవారం ర్యాలీగా మంగళగిరి వెళతారు. అక్కడ మధ్యాహ్నం 12 గంటలకు పార్టీలో చేరతారు. ఇటీవల పవన్ భీమవరం వచ్చినప్పుడు అంజిబాబును మర్యాద పూర్వకంగా కలిసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం విజయవాడలో భేటీ అయ్యి భీమవరం రాజకీయ పరిస్థితులపై సమీక్షించారు. ఈ నియోజకవర్గం నుంచే అంజిబాబు జనసేన తరపున బరిలోకి దిగనున్నారు.

బాబ్జికి బాబు పిలుపు.. నేడు భేటీ

భీమవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వలవల బాబ్జికి పార్టీ అధినేత చంద్రబాబు నుంచి పిలుపు వచ్చింది. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ భేటీ జరగనుంది. దీనికి స్థానిక ముఖ్య నాయకులు కూడా హాజరు కానున్నారు. పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం జనసేనకు కేటాయించడంతో ఒకటి, రెండు రోజులలో బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటన చేయనున్నారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు బాబ్జికి భరోసా కల్పించడంతోపాటు, నియోజకవర్గంలో పార్టీకి ఎలాంటి నష్టం వాటిల్లకుండా కార్యాచరణ రూపొందించనున్నారు.

త్రిశూలంతో జగన్ పాలన అంతం

టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట

భీమవరం అర్బన్, మార్చి 11 : ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ పాదయాత్ర చేసి నవరత్నాల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొ న్నారు. 'టీడీపీ-బీజేపీ-జనసేన త్రిశూలంతో రాష్ట్రంలో సీఎం జగన్ దుర్మార్గపు పాలనను అంతం చేయడానికి ముందుకు వస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ, కాపు సంక్షేమం తదితర అభివృద్ధి పథకాలను రద్దు చేసిన జగన్ వలంటీర్ల ద్వారా తిరిగి అధికారంలోకి రావాలనుకోవడం అసంభవం. తన సిద్ధం సభలలో జనం లేకపోయినా గ్రాఫిక్స్ మాయాజాలంతో ప్రజల దృష్టిని మార్చలేరు' అని అన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణకు ప్రచార రథాలు

భీమవరం టౌన్, మార్చి 11 : జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి, వాటిని బీజేపీ మేనిఫెస్టోలో చేర్చేందుకు ఏర్పాటుచేసిన ప్రచార రథాలను సోమవారం భీమవరంలోని నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయం వద్ద పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాకా సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ- బీజేపీ-జనసేన పొత్తుల్లో భాగంగా బీజేపీ గెలిచే అవకాశం ఉన్న విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, రాజమండ్రి, నర సాపురం, తిరుపతి, రాజంపేట వంటి పార్లమెంటు స్థానా లను అధిష్ఠానానికి వివరించామ న్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చి బీజేపీ టికెట్ ఆశించే వారిపట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ పేరిచర్ల సుభాష్, జిల్లాప్రధాన కార్యదర్శులు అల్లూరి సాయిదుర్గరాజు, కోమటి రవికుమార్, పట్టణ కన్వీనర్ కాగిత సురేంద్ర, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ మోహీద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలో కాంగిరేసు

ఏలూరు జిల్లాలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకూ పోటీ

అభ్యర్థుల దరఖాస్తులు వడబోసిన పీసీసీ

ఈ వారంలో జాబితా విడుదలకు అవకాశం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వచ్చే సాధారణ ఎన్నికల్లో తమ అభ్యర్థులను రంగంలో దించేందుకు కాంగ్రెస్ తుది ప్రయత్నాల్లో పడింది. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోటీ చేసే ఆశావహుల నుంచి వచ్చిన దరఖాస్తుల వడపోత దాదాపు పూర్తి కావొచ్చింది. ఆయా నియోజక వర్గాల్లో వున్న రాజకీయ, ఆర్థిక సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులను ఎంపిక చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. వామపక్షాలతో ఎన్నికల దోస్తీకి కట్టుబడుతూనే పార్లమెంట్ స్థానాలకు ఆర్థిక హంగు కలిగిన వారిని రంగంలో దింపాలని భావిస్తోంది.

ఏలూరు లోక్‌సభకు పోటా పోటీ

ఏలూరు లోక్‌సభా స్థానం నుంచి పోటీ చేసేందుకు అత్యధికులు పోటీపడుతున్నారు. ఒకప్పుడు ఎన్నికలొచ్చాయంటే ఢిల్లీకి రెక్కలు కట్టుకుని వాలి తాము పోటీ చేసే స్థానాల నుంచి టికెట్ దక్కేలా నేతలంతా పోటీ పడేవారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ దాదాపు ఒట్టిపోయింది. 2014, 2019 ఎన్నికల్లోనూ అనేక స్థానాలకు కాంగ్రెస్ పోటీ చేసినా అది నామ్‌కే వాస్తేగా మిగిలింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల రంగంలోకి దిగిన తర్వాత కాంగ్రెస్‌లో కొంత జోష్ పెరిగి సమాంతరంగా ఆశావహుల సంఖ్య గతం కంటే రెట్టింపైంది. ఏలూరు లోక్‌సభా స్థానం నుంచి పోటీ చేసేందుకు 10 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఈ మధ్యనే ఏలూరుకు షర్మిల పర్యటనకు వచ్చినప్పుడు ఆమె సమక్షంలో చేరిన కావూరి లావణ్య ఏలూరు నుంచి బరిలో దిగేందుకు ఆసక్తితో ఉన్నారు. తనకు పార్టీపరంగా మద్దతు ఇవ్వాల్సిందిగా తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం కలిసి అభ్యర్థించారు. లావణ్యతోపాటు పద్మరాజు, కొండపల్లి శ్రీనివాస్, లీలా ప్రశాంతకుమారి, వెంకటరమణ, సత్యేంద్రబాబు సైతం ఎంపీ స్థానానికి పోటీకి సిద్ధంగా ఉన్నామని ఏపీసీసీకి దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. ఈ మధ్యనే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సైతం ఆశావహుల జాబితాను పూర్తిగా పరిశీలించి కొందరితో ముఖాముఖి భేటీ అవుతున్నారు. పార్లమెంట్‌కు పోటీ చేసే అభ్యర్థులను త్వరలో ప్రకటించబోతున్నారు.



తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో భేటీ అయిన కావూరి లావణ్య

ఎమ్మెల్యే స్థానాలకు సైతం..

ఏలూరులోని ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. ఇక్కడ పోటీకి 50 మందికిపైగా పీసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో కొన్నిటిని పూర్తిగా తొలగించి, మరికొన్నింటిపై తుది కసరత్తు చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గం నుంచి సత్యేంద్ర బాబు, విజయ్ అచ్యుతం, సుబ్బరాజు వంటివారు దరఖాస్తు చేసుకోగా, పాతపాటి హరికుమార్‌వైపు పార్టీ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. దెందులూరు నుంచి ఆలపాటి నరసింహమూర్తి, డీవీఆర్‌కే చౌదరిలలో ఒకరికి చాన్స్ దక్కే అవకాశం ఉంది. ఏలూరులో పార్టీ అధ్యక్షుడు రాజనాల రామమోహనరావుతోపాటు మరో ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారు. బురదగుంట క్రాంతి, నేరెళ్ల సతీష్ పేర్లు ప్రముఖంగా పరిశీలనలో ఉన్నాయి. ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం పోలవరంలో అనేకమంది దరఖాస్తు చేసినా పైడా పోతురాజు, కొంగర పోసిరత్నం, శ్రీరామ్‌లలో ఒకరికి చాన్స్ ఇవ్వబోతున్నారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం చింతలపూడిలోనూ భారీ సంఖ్యలో ఆశావహులు కాంగ్రెస్ పక్షాన పోటీకి సిద్ధపడుతున్నారు. చింతలపూడిలో వున్న రాజకీయాలను దృష్టిలో పెట్టుకుని సీనియర్లు, జూనియర్లు తెర ముందుకు వచ్చారు. ఈ స్థానం నుంచి పది మంది దరఖాస్తు చేసుకోగా, సుందరరావు, సురేష్, కొండపల్లి శ్రీనివాస్, బొద్దు శ్రీనివాస్ పేర్లపైనే కసరత్తు సాగుతోంది. నూజివీడు నుంచి ఏకైక ఆశావహుడు మచ్చా అశోక్‌ను రంగంలో దింపే అవకాశం ఉంది. కైకలూరులో ఎంవీఎస్‌ఆర్ గాంధీ, నాగరాజ్ గౌడ్, నిరీశ్వరరావు పేర్లు పరిశీలనలోకి వచ్చాయి. తుది కసరత్తులో కొన్ని నియోజకవర్గాల్లో కొందరి పేర్లలో మార్పులు చేర్పులు చేసే అవకాశాలు స్పష్టంగా వున్నాయి. కాంగ్రెస్ నుంచి పోటీ చేసే ఆశావహులు ఇప్పటికే తమకు తోచిన మార్గాల్లో తమకు అనుకూలంగా తుది ప్రయత్నాలు చేస్తూ సీనియర్లతో భేటీ అవుతున్నారు.



విచారణ అధికారికి ఫొటోలు, వీడియోలు సాక్ష్యాధారాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామానాయుడు

వైసీపీ నాయకుల పెన్షన్ సొమ్ము పంపిణీపై విచారణ

- సాక్ష్యాధారాలను అందించిన ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు టౌన్, మార్చి 11 : పాలకొల్లు నియోజకవర్గంలో వృద్ధులకు, వితంతువులకు వలంటీర్లు పంపిణీ చేయాల్సిన పెన్షన్ సొమ్మును మార్చి 1, 2 తేదీల్లో వైసీపీ నాయకులు పంపిణీ చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలతో కూడిన సాక్ష్యాధారాలను ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విచారణ అధికారికి అందించారు. వైసీపీ నాయకుల పంపిణీపై ఇప్పటికే ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీకి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీఎస్ఎన్ రెడ్డి విచారణ జరిపారు. విచారణలో ఎమ్మెల్యే సహా, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలు హాజరయ్యారు. విచారణ అనంతరం ఎమ్మెల్యే నిమ్మల విలేకరులతో మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు పంపిణీ చేయాల్సిన పెన్షన్ సొమ్మును వైసీపీ నాయకులు పంపిణీ చేస్తూ ఆ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జ్ గుడాల గోపీ ఇచ్చారంటూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలంటూ ప్రచారం చేసుకున్నారన్నారు.

సర్వం సిద్ధం

- రెండు, మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్
- 500 మంది భద్రతా బలగాలు జిల్లాకు చేరిక

భీమవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి):సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధమైంది. ఎన్నికలకు సంబంధించి రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ జారీ కానుండడంతో జిల్లాలోని ఏడు అసెంబ్లీలకు సంబంధించిన పోలింగ్ బూత్‌లు, ఎన్నికల సిబ్బంది నియామకాలను పూర్తి చేశారు. వారం రోజులుగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. గత కలెక్టర్ ప్రశాంతి ఇప్పటికే తుది ఓటర్ల జాబితాను ఖరారు చేశారు. పోలీసుల నియామకం పూర్తిచేశారు. తదుపరి ఏర్పాట్లు రాజకీయ పక్షాలకు సంబంధించిన శిక్షణ తరగతులను పూర్తిచేశారు. దీంతో నోటిఫికేషన్ జారీ నాటికి ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నట్లే. జిల్లాలో ప్రస్తుతానికి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 14 లక్షల 61 వేల 337 మంది ఓటర్లు ఉన్నారు. 1463 పోలింగ్ బూత్‌లు సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు వివిధ శాఖలకు చెందిన మొత్తం పది వేల 500 మంది ఉద్యోగుల నియామకాలు పూర్తయ్యాయి. వీరికి అవసరమైన శిక్షణను అందజేశారు. తాజాగా 500 మంది సాయుధ బలగాలు జిల్లాకు చేరుకున్నారు. మరికొందరిని పోలింగ్ నాటికి జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సాయుధ బలగాలు, పోలీసులు కలిసి కవాతు ప్రక్రియ కొనసాగిస్తున్నారు. పట్టణాలతోపాటు మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో 'మీకు మేం ఉన్నాం. ధైర్యంగా ఓటు వేయండి' అంటూ వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓట్లు వేసేందుకు అవసరమైన ఈవీఎంలు భీమవరం స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ భవనంలో ప్రత్యేక భద్రతలో ఉంచారు.

విష్ణు, ఎస్ఆర్‌కేఆర్‌ల్లో కౌంటింగ్

పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలు, కౌంటింగ్ ప్రక్రియకు గతంలో ఒకే విద్యా సంస్థను సిద్ధం చేసేవారు. ఎస్ఆర్ కేఆర్ విద్యా సంస్థలో కౌంటింగ్ జరిగేది. తర్వాత విష్ణు ఇంజనీరింగ్ సంస్థల్లో చాలాసార్లు కొనసాగించారు. ఈసారి ఏడు అసెంబ్లీలకు సంబంధించి గందరగోళం ఏర్పడకుండా రెండు విద్యా సంస్థల్లోనూ కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీలో నాలుగు అసెంబ్లీలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచి కౌంటింగ్ చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో కౌంటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ రోజున పోలింగ్ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే ఈ విద్యా సంస్థల్లోకి కేటాయించిన అసెంబ్లీలో ఈవీఎంలను చేరుస్తారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎస్పీ సమీక్షలు నిర్వహించారు. రాజకీయ పక్షాలకు చెందిన పార్టీలతో ఈ వారంలో మూడు దఫాలు కలెక్టర్ సుమిత్‌కుమార్ అవగాహన కల్పించారు. నోటిఫికేషన్ వచ్చిన వెంటనే కోడ్ అమలులోకి వస్తుందని, దీనిని పక్కాగా పాటించాలన్నారు.

కొత్త జేసీగా ప్రవీణ్ ఆదిత్య

జేసీ రామసుందర్‌రెడ్డి ఆకస్మిక బదిలీ





భీమవరం, మార్చి 11 :పశ్చిమ గోదావరి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డిని కాకినాడ జేసీగా బదిలీ చేస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఆయన స్థానంలో కాకినాడ జేసీ ప్రవీణ్ ఆదిత్యను నియమించారు. జిల్లా ఏర్పాటు చేసిన 23 నెలల కాలంలో ఇప్పటికి ఇద్దరు జేసీలు బదిలీ అయ్యారు. కలెక్టర్‌ను గత నెలలో బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. సౌమ్యుడుగా పేరు తెచ్చుకున్న రామ సుందర రెడ్డి బదిలీ ఆకస్మికంగా జరగడం చర్చనీయాంశమైంది.

జనసేన లీగల్ సెల్ ఫిర్యాదుతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికల సంఘం షాక్ - మెయిన్‌లో



భీమవరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

నోటిఫికేషన్ వచ్చిన 24 గంటల్లో తొలగించాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం, మార్చి 11 : ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ముందే జిల్లాలో ఇప్పటికే ఏర్పాటు చేసిన వివిధ రాజకీయ పార్టీల ప్రచార సామగ్రిని గుర్తించి నివేదిక తయారు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి సోమవారం జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో ఎన్నికల ప్రవర్తనా నియమా వళి అమలుపై కలెక్టర్ సమీక్షించారు. 'నోటిఫికేషన్ విడుదలైన 24 గంటల్లో ప్రభుత్వ ఆస్తులపై, 48 గంటల్లో ప్రైవేట్ ఆస్తులపై వున్న రాజకీయ పార్టీల బ్యానర్లు, వాల్ పోస్టర్లు, పెయింటింగ్స్, విగ్రహాలు, ఫ్లెక్సీలు, జెండాలు, పాంప్లెట్స్, ఒక పార్టీని సూచించే రంగులు, ఫొటోలు తదితర ప్రచార సామగ్రిని గుర్తించి తొలగించాలి. రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు తెల్లటి వస్త్రంతో కప్పి ఉంచాలి. సచివాలయాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాలు, కమ్యూనిటీ హాల్స్, వాటర్ ట్యాంక్‌లు, రైల్వే, ఆర్టీసీ తదితర గోడలపై రాజకీయ నాయకుల ఫొటోలను, పెయింటింగ్‌లను వైట్ స్టిక్కర్‌తో మూసివేయాలి. ప్రింటర్లకు ముందుగానే నోటీసులు జారీచేయాలి. రాజకీయ పార్టీలకు సంబంధించి వారు ముద్రించే ఫ్లెక్సీలు, కరపత్రాలపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నెంబర్ విధిగా ముద్రించాలి. అభ్యర్థుల ఎన్నికల ప్రచార వీడియోల ప్రదర్శనకు ముందుగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎం.సి.ఎం.సి) అనుమతి పొందాలి. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ రామ్ సుందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శివనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో ఊళ్లు!

బిల్లులు చెల్లించలేదని పంచాయతీలకు విద్యుత్ కట్

- వీధి దీపాలు వెలగక

అంధకారంలో పోలవరం మండలం

పోలవరం, మార్చి 11 : పోలవరం మండలంలో అన్ని పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించక బకాయి పడడంతో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు ఆయా పంచాయతీల విద్యుత్ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వీధి లైట్లు వెలగకపోవడంతో అన్ని పంచాయతీల్లో గాఢాంధకారం అలుముకుంది. పోలవరం, గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, ప్రగడపల్లి, ఎల్ఎన్‌డీపేట, తూటిగుంట, కొరుటూరు, గెడ్డపల్లి పంచాయతీల్లో విద్యుత్ నిలిపివేశారు. ఈ విషయంపై పట్టిసీమ, ప్రగడపల్లి, పోలవరం పంచాయతీ సర్పంచ్‌లు మాట్లాడుతూ నిధుల లేమి కారణంగా బిల్లులు సకాలంలో చెల్లించ లేకపోయినట్టు తెలిపారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనారాయణని వివరణ కోరగా మూడేళ్లుగా అన్ని పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, వారం రోజులుగా పంచా యతీలకు బకాయిల చెల్లింపు విషయంపై నోటీసులు పంపించామన్నారు. కేంద్రుకోట, జిల్లేళ్లగూడెం పంచాయతీలు మినహా మిగిలిన పంచాయతీలు బకాయిలు చెల్లించలేదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు.



వీధిలైట్లు వెలగక అంధకారంలో పోలవరం మెయిన్‌రోడ్

వైభవంగా కొల్లేరు పెద్దింటమ్మ ఉత్సవాలు ప్రారంభం



కైకలూరు, మార్చి 11 : కొల్లేటి కోటలో కొలువై ఉన్న పెద్దింటమ్మవారి ఉత్స వాలు వైభవంగా ప్రారంభ మయ్యాయి. సోమవారం ఉదయం 8.45 గంటలకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు విశేష పూజలను చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎంపీపీ అడవి కృష్ణ, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, ఆలయ అధికారి కేవీ గోపాలరావు, సయ్యపురాజు గుర్రాజు, తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలు ఈనెల 24వ తేదీ వరకు జరగనున్నాయి. 21వ తేదీన జలదుర్గ అమ్మవారికి, గోకర్ణపురంలో కొలువై ఉన్న గోకర్ణేశ్వరస్వామి వార్లకు వైభవంగా కల్యాణం జరగనుంది.

ఎన్నికల సభల్లా చెక్‌ల పంపిణీ

- ఆసరా సభలో వైసీపీకి ఓట్లు వేయాలని నియోజకవర్గ సమన్వయకర్త విజయరాజు పిలుపు
- చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా చెక్‌లు పంపిణీ చేసి వెళ్లగానే.. వైసీపీ నేతలు మళ్లీ పంపిణీ

లింగపాలెం, మార్చి 11 : ఆసరా సభలను వైసీపీ నేతలు ఎన్నికల సభలుగా మార్చేస్తున్నారు. అదే పార్టీకి చెందిన చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా స్థానంలో నియోజకవర్గ సమన్వయ కర్తగా విజయరాజును నియమించారు. అప్పటి నుంచి ఎమ్మెల్యే చేయాల్సిన ప్రారంభోత్సవాలు, సభలు వరుసగా ఈ నేతలే నిర్వహిస్తున్నారు. లింగపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఏపీఎం కమల ఆధ్వర్యంలో ఆసరా చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా మహిళలకు చెక్కును అందజేసి వెళుతుండగానే సమన్వయకర్త విజయరాజు వచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థిస్తూ సభను పార్టీ కార్యక్రమంలా మార్చేశారు. ఆయన మాట్లాడుతుండగానే మహిళలు వెనుతిరగడంతో వెలుగు సిబ్బంది గేట్లు మూసేశారు. విజయరాజు మరోసారి అదే చెక్కును మహిళలకు అందజేయడంతో ముక్కున వేలేసుకున్నారు.



గేటు మూసివేస్తున్న వెలుగు సిబ్బంది

ప్రొటోకాల్ పాటించాల్సిందే : ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి : 'ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా జరగాలి. అధికారులైనా, పార్టీ నాయకులైనా ప్రొటోకాల్ పాటించాలి' అంటూ ఎమ్మెల్యే ఎలీజా వ్యాఖ్యానించారు. చింతలపూడిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'చింతలపూడి మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత పంపిణీలో పాల్గొనడానికి వెళ్లాను. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా అనధికార వ్యక్తులు వేదికపై ఉండడంతో వెనుదిరిగి వచ్చేశాను. గతంలోనూ ఈ విధంగానే జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.' అని పేర్కొన్నారు.



ఏఎన్ఎంకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్

185 మంది వైద్య ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ఉత్తర్వుల అందజేత

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 11 : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో క్రమబద్ధీకరణకు అర్హతలు సాధించిన 185 మంది వివిధ కేడర్ల కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను సోమవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందజేశారు. తొలుత ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో సంబంధిత ఉద్యోగుల సర్టిఫికెట్లను, ప్రభుత్వ ఉత్తర్వులను మరోదఫా సరిచూసుకుని క్రమబద్ధీకరణ ఆదేశాలను అందజేశారు. ఎంపీహెచ్‌ఏ (మేల్,ఫిమేల్), ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు కలిపి మొత్తం 185 మందికి ప్రస్తుతం పనిచేస్తున్న ఆయా పీహెచ్‌సీల్లోనే రెగ్యులర్ ఉద్యోగులుగా ఇకమీదట కొనసాగుతారు. వీరంతా ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీనుంచి రెగ్యులర్ ఉద్యోగులుగా పరిగణించబడతారని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట వివరించారు. కాగా క్రమబద్ధీకరణకు ఇంకా మిగిలి వున్న 58 మంది ఉద్యోగులకు సంబంధించిన జీవోలు రాగల రెండురోజుల్లో విడుద లయ్యే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఏవో మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు కౌన్సెలింగ్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 11 : ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు బోధించేందుకు ఉద్దేశించిన స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ కేడర్ ఉపాధ్యాయ పదోన్నతుల కౌన్సెలింగ్ సోమవారం ఏలూరు డీఈవో కార్యాలయంలో జరిగింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 8 పోస్టులుండగా నిర్ణీత అర్హతలు గల సెకండరీ గ్రేడ్ టీచర్లను కౌన్సెలింగ్‌కు పిలిచారు. ఆయా స్కూళ్ళకు అభీష్టాన్ని తెలియజేసిన వారికి పదోన్నతి నియామక పత్రాలను డీఈవో ఎస్.అబ్రహం అందజేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే పదోన్నతి పొందినవారంతా ఆయా నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవస్థాపక చైర్మన్ సంపత్‌కుమార్

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇంజనీర్ విభాగం ఏర్పాటు

ఏలూరు రూరల్, మార్చి 11: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఇంజినీరింగ్ విభాగం ఏర్పాటు అయింది. సోమవారం ఏలూరులో కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్రం మొత్తంమీద ప్రతి జిల్లా నుంచి లైసెన్స్‌డ్ ఇంజినీర్లు, ఆయా జిల్లాల అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్‌హెచ్‌ఆర్‌పీ తరఫున నియమించినట్టు వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. ఇంజినీర్ విభాగంలో రాష్ట్ర చైర్మన్‌గా వేల్పుల రాము, రాష్ట్ర అధ్యక్షుడిగా ముని శ్రీనివాసరావు, సెక్రటరీగా కె.కమలాకర్‌రెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బొందిలి శంకర్‌లను నియమించారు. నేషనల్ వైస్ చైర్మన్ జి.కృష్ణకిషోర్, కె.సత్యలక్ష్మీ, గిరిప్రసాద్, సతీష్‌కుమార్, ఆవుల చైతన్య, కామేష్ యాదవ్, సురేష్‌బాబు,మూర్తి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న నిట్ కళాశాల విద్యార్థులు

దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటే..

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 11 : ఓటు వజ్రాయుధం లాంటిదని ఏపీ నిట్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ జీటీ వీరేష్‌కుమార్ అన్నారు. ఏపీ నిట్ విద్యార్థులకు సోమవారం ఓటుహక్కుపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వీరేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటే అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులందరూ తప్పని సరిగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికలలో ఓటుకి నోటు తీసుకోకుండా సమాజానికి మేలు చేసే నాయకులను ఎన్నుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఓటు హక్కుపై తల్లిదండ్రులతో పాటూ, చుట్టుపక్కల వారిని కూడా చైతన్య పరచాలన్నారు. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

నరసాపురం డీఎస్పీగా శ్రీనివాస్



నరసాపురం, మార్చి 11 : నరసాపురం డీఎస్పీగా జి.శ్రీనివాసును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన విజయవాడ నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఇప్పటివరకు పనిచేసిన డీఎస్పీ మనోహ రాచారి తిరుపతి ఏసీబీ డీఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. 2022లో ఆయన నరసాపురం డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. సబ్ డివిజన్‌లో అనేక కీలక కేసుల్ని చేధించారు.

మురుగు పారే దారేది ?



పూడుకుపోయిన వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన ప్రధాన డ్రెయినేజీ

డ్రెయినేజీ అస్తవ్యస్తం.. పేరుకుపోయిన చెత్త

గూడెం ప్రజలకు ఏళ్ల తరబడి అవస్థలు



28వ వార్డులో నిలిచిపోయిన మురుగు నీరు

తాడేపల్లిగూడెం అర్బన్ , మార్చి 11 :తాడేపల్లిగూడెం పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. మురుగు నీరు వెళ్ళే ప్రధాన డ్రైనేజీలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు పారక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో వన్‌టౌన్‌కు సంబంధించి మురుగు నీరు వెళ్ళే డ్రైనేజీ తాలూకా సెంటర్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎస్‌బీఐ బ్యాంక్ , ఎల్ఐసీ , రైల్వే ట్రాక్ సమీపం నుంచి కడకట్ల రైల్వే గేటు దాటి ఏలూరు కాలువలో కలుస్తుంది. అయితే ఈ డ్రైనేజీ చెత్త చెదారంతో పూర్తిగా నిండి పోవడంతో నీరు సరిగా వెళ్లడం లేదు. ముఖ్యంగా రైల్వే ట్రాక్ సమీపంలో ఈ డ్రైనేజీ మొత్తం చెత్త, ముళ్ళ పొదలతో నిండిపోయింది. రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న దొమ్మర కాలనీ(28 వ వార్డు) ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలం అయితే పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని, చిన్నపిల్లలతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.టూటౌన్ ప్రాంతానిది కూడా ఇదే సమస్య. ఇక్కడి మురుగు నీరంతా పెంటపాడు సమీపంలో ఉన్న మురుగు కాలువలో కలుస్తుంది. ఇది కూడా పూడుకు పోవడంతో నీరు సరిగా వెళ్లక ఈ ప్రాంతవాసులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.తూడు కారణంగా మురుగు కాల్వలో నీరు లాగక పోవడంతో వర్షాకాలంలో నీరు పక్కనే ఉన్న పొలాల్లోకి చేరి పొలాలు మొత్తం మునిగి పోతున్నాయి. దీంతో రైతులు తమ పొలాలకు గండ్లు కొట్టి పక్కనే ఉన్న మిడ్ లెవెల్ కాలువలోకి నీరు వదిలేసేవారు. దీంతో ఇరిగేషన్ అధికారులకు, రైతులకు మధ్య పలు మార్లు వాగ్వాదాలు కూడా చోటు చేసుకున్నాయి. అధికారులు ఈ వేసవిలో తూడు తొలగించి నీరు వెళ్ళేలా చూడాలని స్థానిక ప్రజలు, రైతులు కోరుకుంటున్నారు.

దోమలతో ఇబ్బందులు



మురుగు నీరు పారక చాలా ఇబ్బందులు పడుతున్నాం.ఈ పరిస్థితి చాలా రోజుల నుంచి ఉంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నీరు ఇళ్ల వద్ద నిలిచిపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-పసుపులేటి సుబ్బమ్మ, తాడేపల్లిగూడెం 28వ వార్డు

అధికారులు స్పందించాలి



ప్రధాన డ్రైనేజీ మొత్తం పూడుకుపోయింది.దీంతో మురుగు నీరు వెళ్లడం లేదు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుంది. మురుగు నీరు ఇళ్ల వద్దే ఉండిపోవడంతో జ్వరాల బారిన పడుతున్నాం. ప్రధాన డ్రైనే జీలో పూడికలు తొలగిస్తే గాని పరిస్థితి చక్కబడదు. అధికారులు స్పందించి డ్రైనేజీలో పూడికలు తీయాలని కోరుతున్నాం.

-కొమ్మిరెడ్డి గౌరి, తాడేపల్లిగూడెం 28వ వార్డు



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి శ్రీనివాస్

ఓటుతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధిద్దాం

తణుకు, మార్చి 11: ఒక్క ఓటుతో రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధిద్దామని విశ్రా ంత ఐఏఎస్ అధికారి బండ్ల శ్రీనివాసు అన్నారు. సోమవారం సామాజిక న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో పార్ల మెంటరీ ఎన్నికలు- పౌర సంఘాల కర్తవ్యం అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజికవేత్త డీవీవీఎస్ వర్మ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, వైసీపీలు తమ స్వప్రయోజనాలు కోసం రాష్ట్ర ప్రయోజనాలను తుంగలో తొక్కుతున్నాయని ప్రత్యేక హోదా అమలు కాక పోవడానికి బీజేపీతో ఆ పార్టీలు కుమ్మక్కు కావడమే కారణమన్నారు. బలమైన పార్లమెంటు అభ్యర్థులకు ఓటు వేసి దేశ రాజకీయాలను మార్చుకోవాలన్నారు. రాష్ట్రానికి మంచి భవిష్యత్తు సాధించుకోవాలన్నారు. సామాజిక న్యాయ పోరాట సమితి అధ్యక్షుడు పోరూరి మురళీకుమార్ పార్లమెంట్ అభ్యర్థికి వేసే ఓటుతో దేశ రాజకీయాన్ని మారుద్దాం, రాష్ట్రానికి మంచి భవిష్యత్‌ను సాధించుకుందాం నినాదంతో రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు. సమితి గౌరవాధ్యక్షుడు అంబేడ్కర్, మాల్యాద్రి, వెంకటేశ్వర రావు, అబ్బయ్య, డాక్టర్ ఆలపాటి శ్రీనివాసు, కృష్ణారావు, డాక్టర్ రమేష్ చంద్రబాబు పాల్గొన్నారు.

నా ఓటు ఏమైంది.. ?



ఆకివీడు, మార్చి 11: ఓటర్ల జాబితాలో ఆకివీడు రెండో వార్డుకు చెందిన బెజవాడ రామసీత తన ఓటు కనపడక పోవడంతో అధికారులను ప్రశ్నించగా కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. గత సార్వత్రిక ఎన్ని కలు, ఇటీవల నగర పంచాయతీ ఎన్నికలకు ఓటు వేశానని ప్రస్తుత జాబితాలో ఎందుకు తొలగించారని అధికారులను ప్రశ్నిస్తోంది.

ప్రశాంత వాతావరణంలో ఓటేయాలి

భీమవరం క్రైం, మార్చి 11 : ఎన్నికల్లో అధైర్యపడకుండా నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని పోలీసు అధికారులు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు సోమవారం భీమవరం వన్‌టౌన్, పాలకొల్లు రూరల్, అత్తిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంతమైన వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని పోలీసులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ సంసిద్ధంగా ఉందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

గూడ్స్ షెడ్డు ఆధునికీకరణ పనులకు నేడు శంకుస్థాపన

వర్చువల్ విధానంలో ప్రధాని ప్రారంభం

ఏలూరులో కార్యక్రమానికి గవర్నర్ హాజరు



ఏలూరు క్రైం, మార్చి 11 : ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లోని గూడ్స్ షెడ్డు ఆధునీకరణ పనులకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఏలూ రులో జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈనెల 12వ తేదీ ఉదయం 12 గంటలకు హాజరు కానున్నారు. రైల్వే అధికారులు ఆర్‌పిఎఫ్, జీఆర్‌పీ, సివిల్ పోలీసులు, ఇంటిలిజెన్స్ అధికారులు, సెక్యూరిటీ అధికారులు సోమవారం సాయంత్రం ఏలూరు గూడ్స్ షెడ్డు ప్రాంతాలను బాంబ్ స్క్వాడ్‌లు, పోలీసు జాగిలాలతో పరిశీలన చేయించారు.

రాజకీయ పార్టీలు బ్రాహ్మణ వర్గాన్ని పట్టించుకోకపోవడం దారుణం

ఏలూరు రూరల్, మార్చి 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో బ్రాహ్మణ కులాన్ని రాజకీయంగా దూరం పెట్టాలని చూస్తున్నాయని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ దేశమంతా బ్రాహ్మణులకు అవకాశాలు కల్పిస్తోందని ఆంధ్రాలో మాత్రం అన్యాయం చేస్తోందని విమర్శించారు. గతంలో నాలుగు సీట్లు ఇచ్చామని గొప్పగా చెబుతున్న వైసీపీ నేడు ఒక్కసీటు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. బ్రాహ్మణ సంఘాలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. విశాఖ, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల్లో పోటీ చేయటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

శేషాచలంపై పాముకాటుకు గురైన భక్తుడు



చికిత్స పొందుతున్న బాధితుడు

ద్వారకాతిరుమల, మార్చి 11: చినవెంకన్న దర్శనానికి వచ్చి నడిచి వెళ్తున్న ఓ వ్యక్తిని పాము కాటు వేసింది. భయంతో అతను కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతనిని స్థానిక ప్రభు త్వాసుపత్రికి తరలించారు. గణపవరం మండలం బొమ్మిడికి చెందిన ఓరింకల ఏసు సోమవారం సాయంత్రం ద్వారకా తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించాడు. అనంతరం నడిచి కొండపై నుంచి దిగువకు వస్తుండగా టోల్‌గేట్ సమీపంలో పొదల నుంచి ఓ పాము రోడ్డు దాటుతూ నడిచి వెళ్తున్న ఏసును కాటు వేసింది భయంతో కేకలు వేయడంతో పరిసర ప్రాంతవాసులు వచ్చి అతడిని పీహెచ్‌సీకి తరలించగా అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. తరువాత మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి పంపారు.



సోమేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

సోమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.10.37 లక్షలు

భీమవరం టౌన్, మార్చి 11 : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వర జనార్ధనస్వామి ఆలయంలో 58 రోజులకు గాను హుండీ ఆదాయం లెక్కించగా 10 లక్షల 37 వేల 912 రూపాయలు వచ్చిందని ఈవో రామకృష్ణంరాజు తెలిపారు. జిల్లా దేవదాయ శాఖ అధికారి సుబ్బారావు పర్యవేక్షణలో, ఈవోలు డి.రామకృష్ణం రాజు, భక్తులు, ధర్మకర్తలు, గ్రామస్థుల సమక్షములో లెక్కింపు నిర్వహించారు. సభ్యులు కూర్మదాసు, సత్యశ్రీనివాస్, శ్రీవల్లి, త్రిమూర్తులు, రఘుబాబు, సూర్యప్రకాష్, లీలా ఈశ్వరి, రామకృష్ణ ఉన్నారు.

నత్తారామేశ్వరంలో 7.18 లక్షలు

పెనుమంత్ర, మార్చి 11 : పెనుమంత్ర మండలం నత్తారామేశ్వరంలోని రామ లింగేశ్వరస్వామి ఆలయ హుండీలను లెక్కించగా 7 లక్షల 18 వేల 049 రూపాయలు ఆదాయం వచ్చిందని ఈవో గంగా శ్రీదేవి తెలిపారు. హుండీల వల్ల 3 లక్షల 24 వేల 496 రూపాయలు, విరాళాల ద్వారా 3 లక్షల 93 వేల 553 రూపాయలు వచ్చిందని తెలిపారు.



ఆచంటలో ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

ఆచంట, మార్చి 11: ఆచంట రామేశ్వరస్వామి మహాశివరాత్రి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిశాయి.ఆఖరి రోజున స్వామివారికి పుష్పోత్సవం నిర్వహించారు. ప్రసాదంతో పాటు చినమల్లంకు చెందిన నెక్కంటి బుచ్చేశ్వర రావు, కృష్ణవేణి దంపతులు అమ్మవారి కుంకు భరిణలు పంచి పెట్టారు. దీంతో ఆలయం మహిళా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఎస్ఐ ఎం. రాంకుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించగా ఆలయ చైర్మన్ సాగర్, ఆలయ అధికారి రాము, కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ముగిసిన శివదేవుని కల్యాణ మహోత్సవాలు



ద్వారకాతిరుమల, మార్చి 11: శ్రీవారి శేషాచలకొండపై కొలువై క్షేత్ర పాలకునిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో శివదేవుని దివ్య కల్యాణ మహోత్సవాలు సోమవారం రాత్రి జరిగిన విశేష కార్య క్రమాలతో ముగిశాయి. ఉదయం స్వామివారికి అభిషేకాలను అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ జరిగాయి. రాత్రి శ్రీపుష్పయాగోత్సవాన్ని ఆలయ అర్చకులు, పండితులు వేడుకగా నిర్వహించారు.

పవన్ శాసనసభకే పోటీ చేయాలి : జోగయ్య

పాలకొల్లు, మార్చి, 11 :పవన్ కళ్యాణ్ పార్లమెంట్‌కు పోటీ చేయాలనే ప్రయత్నాన్ని విరమించకోవడం మంచిదని మాజీ ఎంపీ చేగొండి హరిరామ జోగయ్య సోమవారం ఒక లేఖ విడుదల చేశారు. రాష్ట్ర పాలనలో భాగస్వామ్యం కావాలంటే శాసనసభకు పోటీ చేయడమే మేలన్నారు. గతంలో చిరంజీవి అనుభవం చూస్తే తెలుస్తుందన్నారు.శాసనసభకు పోటీ చేయకపోతే భవిష్యత్తులో లోకేష్ కోసం జనసేనను తెలుగుదేశంలో విలీనం చేయడం తప్పదనే దుష్ప్రచారం మొదలవుతుందన్నారు.

జగన్నాథపురంలో వైసీపీ అక్రమ తవ్వకాలు

అడ్డుకున్న గ్రామస్థుడిపై కేసు



చెరువు దగ్గర నిలుపుదల చేసిన ఎక్స్‌కవేటర్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 11: తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో రాత్రి సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు సాగిస్తుండగా గ్రామానికి చెందిన యర్రసాని శ్రీను, పలువురు గ్రామస్థులు అడ్డుకున్నారు. నాలుగు ట్రాక్టర్లు, జేసీబిని పట్టుకుని అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ నిధులతో రోడ్లు వేసి అక్రమంగా చెరు వుల్లో గ్రావెల్ తవ్వడంపై తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేశారు. వైసీపీ నాయ కులు గ్రామంలో ఇష్టారాజ్యంగా వ్యవహ రిస్తూ ప్రజాధనాన్ని దోచు కుంటున్నా రన్నారు. చెరువు సబ్ లీజుకు తీసుకున్న తనకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఇష్టారీతిగా తవ్వడం ఏంటని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస రెడ్డిని వివరణ కోరగా తమ పంచాయతీ చెరువును తవ్వుకునే హక్కు తమకు ఉందని పంచాయతీలో అభివృద్ధి పనుల కోసం గ్రావెల్ వినియో గించు కునేందుకు తరలిస్తుండగా అడ్డుకున్నందుకు కేసు పెట్టామన్నారు.

కుక్కల మంద దాడి.. 11 మేక పిల్లల మృతి



చాట్రాయి, మార్చి 11: మండలంలోని చనుబండలో మోదుగు జోజి మేకల దొడ్డిపై సోమవారం కుక్కల మంద దాడి చేసి 11 మేక పిల్లలను చంపేశాయి. చనిపోయిన మేక పిల్లలను చూసి యాజమాని కుటుంబీకులు భోరున విలపించారు. గ్రామాల్లో కుక్కల సంఖ్య పెరిగి మందలుగా సంచరిస్తూ గొర్రెలు, మేకల దొడ్లపైనా, మనుషులపైనా దాడులకు తెగబడుతున్నాయని, అధికారులు స్పందించి కుక్కలను పట్టించి దూర ప్రాంతాల్లో అడవులకు తరలించాలని బాధితులు కోరుతున్నారు.

ఎన్‌ఆర్‌పీ అగ్రహారం పెదయ్యకోడులోకి దూసుకుపోయిన కారు



ఉండి, మార్చి 11 : భీమవరం నుంచి ఉండి వైపుకు వేగంగా వస్తున్న కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పెదయ్య కోడులోకి దూసుకుపోయింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం భీమవరం నుంచి ఉండి మీదగా వస్తున్న కారు ఎన్‌ఆర్‌పీ అగ్రహారంలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి పెదయ్య కోడులోకి దూసుకుపోయింది. కారు డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

శివరాత్రి ఉత్సవాల్లో రెచ్చిపోయిన యువత.. పలువురికి గాయాలు

ఆచంట, మార్చి 11: ఆచంట రామేశ్వరస్వామి వారి మహా శివరాత్రి ఉత్సవాలో ఐదు రోజులు పాటు అత్యంత వేడుకగా జరిగాయి. ఉత్సవాలు పేరు చెప్పి ప్రతీ ఏటా ఏదోక గొడవలు జరగడం పరిపాటిగా మారింది. ఈ సారి కూడా యువత మద్యం సేవించి గొడవలు సృష్టించారు. శివరాత్రి రోజున ఇద్దరు యువకులు గొడవ పడి బ్లేడుతో కోసుకోగా వారికి గాయాలయ్యాయి. ఆఖరి రోజున ఆదివారం రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన ఒక ప్రోగ్రామ్‌లో యువకులు రెచ్చి పోవడంతో చివరకు పోలీసులు జోక్యం చేసుకుని ప్రోగ్రామ్ నిలుపుదల చేసి యువకులను కంట్రోల్ చేశారు. శివరాత్రి ముందు రోజున ఆచంట మార్టేరు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉత్సవాల పేరు చెప్పి యువకులు మద్యం సేవించి గొడవలకు ముఖ్య కారకులవుతున్నారు. పోలీసులు సైతం నియంత్రించలేని పరిస్థితి ఎదురవుతోంది. ఉత్సవాలు ఐదు రోజులు పాటు గొడవలు చోటుచేసుకోవడం పలువురు గాయాలపాలవడం జరిగింది.

క్రైం కార్నర్

పొరుగు రాష్ట్రాల మద్యం స్వాధీనం



తణుకు, మార్చి 11 :అరుణాచల ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మద్యం బాటిళ్లు అక్రమంగా దిగుమతి చేసుకున్నారని ఇద్దరు వ్యక్తులను తణుకు పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద విలే కరుల సమావేశంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి వివరాలను వెల్లడించారు. అరుణా చల్‌ప్రదేశ్ మద్యంతో తణుకు డంపింగ్ యార్డుకు వెళ్ళే ఖాళీ ప్రదేశంలో ఉన్న ఉండ్రాజవరం మండలం కె.సావరం గ్రామానికి చెందిన బోయిన బాలాజీ, రాజమహేంద్రవరానికి చెందిన తుమ్మల రాధాకృష్ణలను అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 220 మద్యం బాటిళ్ళు, కారు, ఆటోతో పాటు ఆరువేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన ఇజ్జాడ పాపినాయుడు, అత్తిలి మండలం ఉరదాళ్ళపాలెంకు చెందిన మాకా రాజేష్, ఇరగవరం మండలం ఇల్లింద్రపర్రుకు చెందిన గంద్రోతులు యేసుబాబులు పరారీలో ఉన్నారని చెప్పారు. పట్టణ సీఐ నాగరాజు, ఎస్ఐ కె.శ్రీనివాసు, పీసీలు జి.శ్రీనివాసు, టి.రవి, ఎస్‌కె అక్బర్‌లాల్, ఆర్ఎండీవీ ప్రసాదు, డి.వెలగేల శ్వరరావు, ఎంపీ శివాజీ, జి.మురళీలను అభినందించారు.

విద్యుదాఘాతానికి యువకుడు మృతి

ఉండి, మార్చి 11 : విద్యుత్ షాక్‌కు గురై ఒక యువకుడు మృతి చెందగా మరొక వ్యక్తి గాయాలైనట్టు ఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. జార్కండ్ రాష్ట్రం సన్‌బాత్ జిల్లా నుంచి మాణిక్ బాహలీ నెలరోజుల క్రితం భీమవరం ప్రాంతంలోని చేపల వ్యాపారి వద్ద పనిచేయడానికి వచ్చాడు. ఆదివారం సాయంత్రం ఉండి-గణపవరం రహదారిలోని రొయ్యల ప్రాసెసింగ్ షెడ్డులో విద్యుత్ మోటర్ ఏర్పాటు చేసేందుకు కొబ్బరిచెట్టుకు ఐరన్ నిచ్చెన వేసుకుని పనులను చేస్తున్నాడు. మరొక వ్యక్తి చందనకుమార్ నిచ్చెన పట్టుకుని వున్నాడు.పైన వున్న విద్యుత్ వైర్లు తగిలడంతో మాణిక్ కిందపడిపోయాడు. కింద వున్న వ్యక్తికి షాక్ తగిలింది. ఇద్దరినీ భీమవరం తరలించగా వైద్యులు మాణిక్ బాహలీ మృతిచెందినట్లు తెలిపారు. మరొక వ్యక్తి చందనకుమార్ ఆరోగ్య పరిస్థితి బాగానే వుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసులపై ఏసీబీ వల

డిపార్టుమెంట్‌కు చెందిన వ్యక్తి నుంచే రూ.25 వేలు లంచం డిమాండ్

చిక్కిన నరసాపురం ఎస్సై, రైటర్, హోంగార్డు

రాజమహేంద్రవరం తరలింపు



పట్టుబడిన సొమ్ముతో ఏసీబీ అధికారులు

నరసాపురం, మార్చి 11 : నరసాపురం పోలీస్ స్టేషన్‌పై సోమవారం ఏసీబీ అధికారులు దాడులు చేసి ఎస్ఐ బీఎస్‌డీఆర్ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావును వలపన్ని పట్టుకున్నారు. బాధితుడి నుంచి రూ.25 వేలు లంచం తీసుకున్న జీపు డ్రైవర్ ప్రసాద్ లొంగిపోయాడు. ఏసీబీ డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపిన వివరాలివి. విజయవాడకు చెందిన విజయసాగర్‌కు నరసాపురం పట్టణానికి చెందిన యువతితో వివాహమైంది. ఇటీవల ఇతనిపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో 498 కేసు నమోదైంది. అతని తండ్రి హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు కాగానే ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి తనపై, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసు పెట్టారని, న్యాయం చేయాలని కోరాడు. దీనికి ఎస్ఐ రూ.20 వేలు, రైటర్ నాగేశ్వరరావు తనకు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మొత్తం ఇస్తేనే కేసులో కొందరి పేర్లను తొలగిస్తామని లేకపోతే యధావిధిగా ఉంచుతామని బెదిరించారు. దీనిపై విజయసాగర్ ఏలూరు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బాధితుడికి రూ.25 వేలు నగదు ఇచ్చి స్టేషన్ సమీపంలో మాటేశారు. లంచం సొమ్మును ఇచ్చేందుకు ఎస్ఐ వద్దకు వెళ్లితే డ్రైవర్‌కు అందించాలని చెప్పాడు. సొమ్మును తీసుకున్న డ్రైవర్ జీపులో పెట్టగానే మాటు వేసిన ఏసీబీ పోలీసులు ఒక్కసారిగా దాడిచేశారు. దీంతో ఉలిక్కిపడ్డ డ్రైవర్ పరుగులు తీశాడు. గుర్తించిన ఎస్ఐ, రైటర్లు బయటకు పరుగులు తీశారు. ఏసీబీ పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. జీపు డ్రైవర్, హోంగార్డు ప్రసాద్ సాయంత్రం ఏసీబీ అధికారుల వద్ద లొంగిపోయాడు. వీరిపై కేసులు నమోదు చేసి రాజమండ్రి తరలించారు. ఈ దాడుల్లో సీఐ సతీష్, ఎస్ఐ ఎస్‌వీ భాస్కర్, సిబ్బంది ఉన్నారు.





ఏసీబీకి చిక్కిన ఎస్ఐ ప్రసాద్, రైటర్ నాగేశ్వరరావు

ఉలిక్కిపడ్డ పోలీసులు..

కొంతకాలంగా నరసాపురం పోలీస్ సర్కిల్ లోని కొన్ని స్టేషన్లపై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కొందరు మధ్యవర్తులుగా కేసులు డీల్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నేరుగా లంచాలు తీసు కోకుండా మధ్యవర్తుల ద్వారానే వ్యవహారాలు చక్కబెడుతున్నారు. ఈ ఆరోపణలు టౌన్ పోలీస్ స్టేషన్‌పై లేకపోలేదు. ఈ క్రమంలో ఏసీబీ దాడులు చేయడం పట్టణంలో సంచలనమైంది.

గుర్తు తెలియని వ్యక్తి దాడి..మహిళకు గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గ

జంగారెడ్డిగూడెం, మారిచ 11 : గుర్తు తెలియని వ్యక్తి దాడిలో ఒక మహిళ గాయపడిన సంఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని సీఎన్‌ఆర్ మాల్ వెనుక ఒక పాఠశాల సమీపంలో మండ దుర్గ నివాసం ఉంటోంది. ఆమె భర్త చనిపోవడంతో ఒంటరిగా ఉంటోంది. సోమవారం ఉదయం ఇంటి తలుపులు తీయగా, ముఖానికి ముసుగు వేసుకున్న వ్యక్తి ఎదురు పడటంతో తన మనుమడు అనుకుని మాట్లాడటానికి ప్రయ త్నించింది. అయితే గుర్తు తెలియని ఆ వ్యక్తి తన వెంట తెచ్చుకున్న కత్తితో దుర్గ మెడపై పెట్టి బెదిరించాడు. దుర్గ ప్రతిఘటిస్తూ కత్తిని పట్టుకోవడంతో ఆమె రెండు చేతులకు గాయాలయ్యాయి. దుర్గ బిగ్గరగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడాన్ని గమనించి ఆ వ్యక్తి పరారయ్యాడు. స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గను డీఎస్పీ రవిచంద్ర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో వివరాలు సేకరించారు. ఎస్ఐ జ్యోతిబసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

కైకరం సచివాలయంలో ఇన్వెర్టర్ చోరీ

ఉంగుటూరు, మార్చి 11 : ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలోని సచివాలయం-2లో ఇన్వెర్టర్ చోరీకి గురైందని కార్యదర్శి తెలిపారు. వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో సోమవారం ఉదయం సచివాలయం-2 తలుపులు తీసి ఉండడాన్ని గమనించి కార్యదర్శి సుబ్రహ్మణ్యం చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కలెక్టర్ స్పందనకు 253 ఫిర్యాదులు

భీమవరం, మార్చి 11 : జగనన్నకు చెబుదాం - స్పందన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను కలెక్టరు సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేటులో స్పందనలో ప్రజల నుంచి వచ్చిన వినతులను కలెక్టరు స్వీకరించారు. స్పందనలో 253 ఫిర్యాదులు అందాయి. స్పందనలో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలని అదే ఫిర్యాదు మరలా స్పందనలో రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ సూచించారు.

ఎస్పీ స్పందనలో 20 ఫిర్యాదులు



భీమవరం క్రైం, మార్చి 11 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేస్తే, వాటిపై చట్టప్రకారం విచారణ జరిపి పరిష్కారం అందించడానికి పోలీస్‌శాఖ ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల అన్నారు. జిల్లా ఎస్పీ సోమవారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 ఫిర్యాదులు ఎస్పీ స్వయంగా స్వీకరించారు. జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పాల్గొన్నారు. స్పందనలో కుటుంబ కలహాలు, భర్త/అత్తరింటి వేధింపులు, భూవివాదాలు, జాబ్ మోసాలు, ఇతర సమస్యల గురించి వినతులు వచ్చాయన్నారు. అదేవిధంగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు.

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి



భీమవరంలో ఎస్‌బీఐ ఎదుట సీపీఎం నాయకుల ఆందోళన

భీమవరం అర్బన్, మార్చి 11: ఎన్నికల బాండ్ల వివరాలు తక్షణం బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం భీమవరం ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని గత నాలుగేళ్లలో అమ్మిన బాండ్లు, వాటిని కొన్నవారి సమాచారాన్ని ఎన్నికల సంఘానికి అందించాలని, ఈసీ ఆ వివరాలను మార్చి 13లోగా బహిర్గతపరచాలని సుప్రీంకోర్టు తీర్పులో ఆదేశించిందన్నారు.

ఆకివీడు: సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేర ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్బీఐ అధికారులు వెంటనే ప్రకటించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎస్బీఐ బ్యాంకు కార్యాలయం దగ్గర పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపి మేనేజరుకు వినతిపత్రం అందించారు.

వీరవాసరం: కొణితివాడలోని ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలని సీపీఎం నాయకులు జుత్తిగ నర్సింహమూర్తి డిమాండ్ చేశారు.

గణపవరం: పిప్పర ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. ఎన్నికల బాండ్ల పేరుతో బీజేపీ సంపాదించిన కోట్లాది రూపాయలు ఎన్నికల సంఘానికి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. ఎపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ, నరసింహమూర్తి, గోవిందు, ఎస్.సంజీవరావు, కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

తణుకు: ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే ఎన్నికల అధికారికి ఇవ్వాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఎస్బీఐ బ్యాంకు వద్ద నిరసన తెలిపి బ్రాంచి అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాయకులు కామన మునిస్వామి, అజయకుమారి, నరసింహారావు పాల్గొన్నారు.

ఇరగవరం: ఎన్నికల బాండ్లు చట్టబద్ధమైన అవినీతితో కూడుకున్నవని సీపీఎం ఇరగవరం మండల కన్వీనర్ కామన మునిస్వామి అన్నారు. ఎన్నికల బాండ్లు వివరాలు తెలపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఇరగవరం ఎస్‌బీఐ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించి బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

రేపు మెగా జాబ్ మేళా

భీమవరం అర్బన్, మార్చి 11: పెంటపాడు డీఆర్‌జి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13న ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎ.కృష్ణారెడ్డి తెలిపారు. ఈ జాబ్ మేళాలో ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, ఆస్ట్రాటెక్, అరబిందో ఫార్మా, తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు కల్గిన పురుష, మహిళ అభ్యర్థులు అర్హులని, కంపెనీ నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారన్నారు. మరిని వివరాలకు 70138 96277ను సంప్రదించాలన్నారు.

పోలీసు స్టేషన్‌కు టెన్త్ ప్రశ్న పత్రాలు



పోలీస్ స్టేషన్‌లో భద్రపరుస్తున్న పదవ తరగతి ప్రశ్నా పత్రాల సెట్లు

ఆకివీడు, మార్చి 11: పదవ తరగతి పబ్లిక్ పరీక్ష పత్రాలు భీమవరం నుంచి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరాయి. సెట్-1, సెట్-2 సంబంధించిన ఎనిమిది పరీక్ష ప్రశ్న పత్రాలు కస్టోడియన్, పోలీసుల సమక్షంలో బాక్సులో పెట్టి సీలు వేసి పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ నెల 18 నుంచి 30 వరకే జరుగు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మండలంలోని నాలుగు సెంటర్లలో విద్యార్థులు రాయబోతున్నారు.

16 మంది విద్యార్థులు గైర్హాజరు

ఆకివీడు, మార్చి 25: ఇంటర్ సెకండీయర్ మ్యాథ్స్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, కార్తికేయ జూనియర్ కళాశాల, దుంపగడప ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 485 మందికి 16 మంది గైర్హాజరయ్యారు. సిట్టింగ్ స్క్వాడ్ కేంద్రాలను పరిశీలించారు.

స్పందనలో మూడు అర్జీలు

ఆకివీడు, మార్చి 11: మండల ప్రజా పరిషత్ కార్యాలయం దగ్గర జరిగిన స్పందనలో మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ, తహసీల్దార్ జె. వెంకటేశ్వరి తెలిపారు.

దోమలు నివారించాలి



దోమలకు నిలయమైన ప్రాంతాలు పరిశీలిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

గణపవరం, మార్చి 11: దోమల నిర్మూలనకు సమష్టిగా అందరూ కృషి చేయాలని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ.లక్ష్మణరావు కోరారు. సోమవారం గణపవరం, సరిపల్లె గ్రామాల్లో దోమల నివారణపై ఇంటింటా పర్యటించి అవగాహన కల్పించారు. అపరిశుభ్ర వాతావరణం వల్ల అనారోగ్యాలు ప్రబలడంతో పాటు దోమలు పెరిగి డెంగీ, మలేరియా వ్యాధులు సోకే ప్రమాదం ఉందని అన్నారు. గ్రామ కార్యదర్శి రామాంజనేయులు, ఆరోగ్య కార్యదర్శులు నాగవేణి, మౌనిక, కృష్ణ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మను వినియోగించుకోవాలి

కాళ్ళ, మార్చి 11 : పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వసంతరావు అన్నారు. పెదఅమిరం గ్రామంలోని బైర్రాజు ఫౌండేషన్ కార్యాలయంలో విశ్వకర్మ పథకంలో భాగంగా బ్రిక్ మేషన్ ఆరు రోజులు శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ పథకాన్ని విపులంగా వివరించారు. 60 ఏళ్లలోపు ఉన్నవారు అందరూ ఈ పథకానికి అర్హులన్నారు. వృత్తిపరమైన పనులు చేసుకునే వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ కఠారి విశ్వనాథరాజు, ఎన్‌ఏసీ సిబ్బంది, బైరాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్లు, చేతి వృత్తిదారులు, తదితరులు పాల్గొన్నారు.

వీరపేరంటాలమ్మ ఆలయ కమిటీ ఏర్పాటు

ఉండి, మార్చి 11: వీరపేరంటాలమ్మ ఆలయ నూతన కమిటి చైర్మన్ గాదిరాజు వెంకట్రాజు, సభ్యులు ముదునూరి వీర్రాజు, కళ్లేపల్లి రామచంద్రరాజు, ముత్యాలపల్లి అర్జునరావు, పెచ్చేటి జేజేశ్వరి, గుబ్బల సత్యవతి, యెన్ని దమయంతి, నల్లూరి గంగారత్నం, తలుపల చెంచులక్ష్మీ, అర్చకుడు కొల్లకూరి సురేష్‌కుమార్‌లను సోమవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అభినందించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ముదునూరి సత్యనారాయణరాజు, మాజీ ఉపసర్పంచ్ ముదునూరి కొండరాజు, మాజీ చైర్మన్లు కళ్లేపల్లి సతీష్‌రాజు, మంతెన రంగరాజు, వీర్రాజు పాల్గొన్నారు.






దొడ్డిపట్లలో ఎమ్మెల్యే నిమ్మల, పెనుమంట్ర మండలంలో పితాని ప్రచారం.. రామన్నగూడెంలో కరపత్రాలు అందిస్తున్న బొలిశెట్టి.. కేపీపాలెంలో నాయకర్‌కు హారతి ఇస్తున్న మహిళలు

ఎస్సీల పట్ల జగన్ కపట ప్రేమ: ఎమ్మెల్యే నిమ్మల

యలమంచిలి, మార్చి 11: రాష్ట్రంలో ఎస్సీల పట్ల సీఎం జగన్‌ది కపట ప్రేమ మాత్రమేనని, ఏనాడు వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయలేదని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు అన్నారు. గుంప ర్రు గ్రామంలో రూ.15లక్షలతో నూతనంగా నిర్మించిన ఎస్సీ సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే నిమ్మల సోమవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 2014-19 మధ్య టీడీపీ హయాంలో పాలకొల్లు నియోజకవర్గంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.185 కోట్లతో ఎస్సీ ప్రాంతాల అభివృద్ధి చేపట్టడం జరిగిందన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో రూపాయి పని చేపట్టలేదని ఆరోపించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఎంపీ నిధు లను తీసుకు వచ్చి ఎస్సీ, బీసీ ప్రాంతాల్లో సామాజిక భవన నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. ఎస్సీ, బీసీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ప్రజలు మద్దతుగా నిలవాలని రామానాయుడు కోరారు. అనంతరం దొడ్డిపట్ల గ్రామం మామిడితోట ప్రాంతంలో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల ఇంటింటా ప్రచారం చేశారు.



ఆరిమిల్లికి శివకేశవ భక్త బృందం మద్దతు

తణుకు, మార్చి 11: తణుకు పట్టణ, పరిసర ప్రాంతాల్లో ఉన్న శివ కేశవ భక్త బృందం టీడీపీ, జనసే ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణకు మద్దతు ప్రకటించారు. సోమవారం ఆయన నివాసంలో పలువురు బృంద సభ్యులు కలిశారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని ఆరిమిల్లి అన్నారు. భక్త బృందం అధ్యక్షుడు పెనుమర్తి సుబ్బారావు, కార్యదర్శి మాణిక్యాలరావు, కోశాధికారి కొమ్మిరెడ్డి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో సర్వే దుర్మార్గం: పితాని

పెనుమంట్ర, మార్చి 11 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండగా అధికార వైసీపీ కుయుక్తులకు పాల్పడుతున్నదని, వలంటీర్లతో ప్రజలను మభ్యపెట్టేందుకు మరొక కుట్రకు తెర లేపారని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆరోపించారు. వలంటీర్లతో అక్రమంగా సర్వే చేస్తున్నారని, జగనన్నే మళ్ళీ రావాలని బయోమెట్రిక్‌లు వెయ్యాలంటూ హుకుం జారీ చేయటం దుర్మార్గమని అన్నారు. కనీసం జ్ఞానం లేని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, ఎమ్మెల్యే రంగనాథరాజు ప్రజా ప్రతినిధులుగా ప్రజాస్వామ్యానికి పనికిరారని అన్నారు. పేదవాడికి ఇచ్చిన పట్టా భూమికి దారి లేదని, ఇల్లు నిర్మించుకునేందుకు ముడి సరుకులు తరలించడానికి రెండు లక్షల ఖర్చు అవుతుందని లబ్ధిదారులు వాపోతున్నారని పితాని సత్యనారాయణ మండిపడ్డారు. నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు వెలగల బులిరామరెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి గూడూరి మురళీ మోహన్, జనసేన మండల అధ్యక్షుడు కోయా వెంకట కార్తీక్, ఉపాధ్యక్షుడు షేక్ మహ్మద్ అలీ, చెరుకువాడ రాజు, గ్రామ అధ్యక్షుడు నాగరాజు సీతా రామ్మోహన్ రాజు, జనసేన గ్రామా అధ్యక్షుడు నాయకులు నాగరాజు అప్పల నరసింహరాజు పాల్గొన్నారు.

అధికారం మనదే : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్ మార్చి 11: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి భారీ మెజార్టీతో గెలవడం తథ్యమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. రామన్నగూడెంలో జనసేన పల్లెపోరు నిర్వహించారు. గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం గ్రామస్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, టీడీపీ నాయకులు మద్దిపాటి ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

మొగల్తూరు, మార్చి 11: రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న జగన్ ప్రభుత్వాన్ని సాగనంపుదామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. సోమవారం కెపిపాలెం పంచాయతీ పరసావారిమెరక నుంచి నంబుల వారి మెరక వరకూ జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం జనసేన, టీడీపీ, బీజేపీలు పొత్తుతో ఎన్నికలకు ముందుకు వచ్చాయన్నారు. ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవాలు

కాళ్ళ, మార్చి 11 : ఏలూరుపాడులో గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ మహోత్సవాల్లో భాగంగా శృంగవృక్షం దత్త పీఠం నాగానందస్వామిజీ సోమవారం ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులనుద్దేశించి చేసిన ప్రవచనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

కిశోర బాలికలకు అవగాహన



కాళ్ళ, మార్చి 11 : ఎల్ఎన్ పురంలో కిశోర బాలికల అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆకివీడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యుక్త వయస్సులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం 'పోషణ్ పక్వాడ' కార్యక్రమంలో భాగంగా ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవడం వలన కలిగే ఉపయోగాలను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

పాలకోడేరు, మార్చి 11 : గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్లో 10వ తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గొరగనమూడి ఆశా వర్కర్ మన్నే అనంత సూర్యకుమారి పరీక్షా సామగ్రి అందజేశారు. హెచ్ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

శాఖాహార ర్యాలీ



వీరవాసరం, మార్చి 11: చింతలకోటిగరువు, వీరవల్లిపాలెం, నడపనవారిపాలెం గ్రామాలలో సోమవారం పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో అహింసా మహాకరుణ శాఖాహార ర్యాలీ నిర్వహించింది. చింతలకోటిగరువు సర్పంచ్ దాసరి మహాలక్ష్మి , మాణిక్యాలు శివాలయం వద్ద నుంచి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. శాహాహార ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. పుస్తకాలు, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎస్ఎస్ఎం అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ , కేవీడీ ప్రసాద్, దాసరి సత్యనారాయణ, యిర్రింకి కొండ పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

వీరవాసరం, మార్చి 11: నందమూరుగరువులోని క్రైస్తవ దేవాలయం ఆవరణలో కెఎల్ఆర్ మోషే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టెంపుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 50 మందికి చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎంఎస్ స్టీఫెన్, కె.జాన్సన్, బి.దానియల్ రాజు, టి జాన్, డీకేవీ ప్రకాష్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను నియమించాలి

తణుకు, మార్చి 11: తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి స్థాయికి తగ్గ పారిశుధ్య కార్మికులను నియమించాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ అండ్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. 40 పడకల ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మారుస్తూ 150 పడకలు చేశారని, కొత్త భవనాలు వచ్చినప్పటికి పాత విధానంలో ఉన్న కార్మికులతో పనిచేయడం వల్ల పనిభారం పెరిగిందన్నారు. యూనియన్ నాయకులు పుష్పలత, వెంకటలక్ష్మి, రత్నం, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు వెంపటాపునకు అవార్డు



తణుకు, మార్చి 11: తణుకు పట్టణానికి చెందిన చిత్రకారుడు డాక్టర్ వెంపటాపునకు దామెర రామారావు పురస్కారాన్ని అందించారు. ఆదివారం రాత్రి మచిలీపట్నం ఆర్ట్ అకాడమీ నిర్వహించిన కళాతపస్వి దామెర్ల రామారావు జయంతి, మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా 30 ఏళ్ళుగా చిత్రకళా రంగానికి చేసిన సేవలు గుర్తించి అవార్డు అందించారని వెంపటాపు తెలిపారు. అవార్డు రావడం పట్ల తణుకు బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఇళ్ల స్థలాల హక్కు పత్రాల పంపిణీ

కాళ్ళ, మార్చి 11 : మండలంలోని వేంపాడు, కోపల్లె, బొండాడ, బొండాడపేట, జక్కరం, ఎల్ఎన్‌పురం, ఆనందపురం గ్రామాలకు చెందిన సుమారు 795 మంది లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలు హక్కు పత్రాలను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం కోపల్లె గ్రామంలో సోమవారం నిర్వహించారు. అనంతరం కోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాప్రస్థానం (శ్మశానవాటిక), గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు.

ఉండి: మహదేవపట్నంలో 115మంది ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు పట్టాలను రిజిస్ట్రేషన్ చేయించి మహిళలకు అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఉపసర్పంచ్ వెంకట సుబ్బరాజు, ఎంపీపీ ఇందుకూరి హరినారాయణరాజు, వైస్ ఎంపీపీ గుత్తుల కనకమహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వ గట్టున చెత్తకు నిప్పు

భీమవరం క్రైం, మార్చి 11 : భీమవరం వన్‌టౌన్ పట్టణ పరిధిలో యనమదుర్రు కాలువగట్టున చెత్తకు నిప్పు అంటుకోవడంతో మంటలు వ్యాపించాయి. సమీపంలో దుకాణాల్లోకి మంటలు చేరడంతో సమాచారం తెలిసిన అగ్నిమాపక అధికారులు, సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకున్నాయి. మంటలను అదుపు చేశారు. గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ కాల్చి పడేయడంతో చెత్త నుంచి మంటలు వ్యాపించి ఉంటాయని భావిస్తున్నామన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం టౌన్, మార్చి11: ఈనెల 16న కోర్టు హాల్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయదుర్గా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్, యాక్సిడెంట్, మనోవర్తి, చెక్ బౌకీ, వరకట్న వేధింపులు, చిట్‌ఫండ్, బ్యాంకులకు సంబంధించిన కేసుల్ని ఈ ఆదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. న్యాయవాదులు కక్షిదారులకు వీటిపై అవగాహన కల్పించి కేసుల్ని రాజీ చేసుకునేలా ప్రయత్నించాలని న్యాయమూర్తి తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నరసాపురం రూరల్, మార్చి 11: చిట్టవరం, గొంది గ్రామాల్లో సోమవారం చీఫ్ విప్ ప్రసాదరాజు పలు అభివృద్ధి పనుల్ని ప్రారంభించారు. అనంతరం రుస్తుంబాదలో జరిగిన చేయూత కార్యక్రమంలో పాల్గొని చెక్కులందించారు. ఆ తరువాత రూ.కోటితో పట్టణంలో ఆధునీకరించిన కాటన్ పార్కును ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ వెంకటరమణ, ఎంపీపీ సోని, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రేలంగిలో పోషణ పక్వాడా

ఇరగవరం, మార్చి 11 : బాలింతలు, గర్భిణులకు సకాలంలో పోషకాహారాన్ని అందిస్తున్నామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డీవీ మాణిక్యాంబ తెలిపారు. రేలంగిలో సోమవారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త పి. ప్రభావతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు, మార్చి 11: పోస్టాఫీసులు అందజేస్తున్న గ్రామీణ జీవిత బీమా సదుపాయాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం పోస్టాఫీసు సూపరింటెండెంట్ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. ఆకుతీగపాడులో పోస్టల్ బీమా చేయించిన కొండేటి సువర్ణరాజు హఠాత్తుగా మృతిచెందడంతో నామినీగా ఉన్న ఆయన భార్య దీనమ్మకు రూ. 1,17,111 పరిహారం అందజేశారు. సర్పంచ్ దానం వెంకటేశ్వర్లు, మెయిల్ ఓవర్స్ జీ.సుధీర్, బ్రాంచ్ పోస్టు మాస్టర్ జీ.కృష్ణ, వైస్ ఎంపీపీ వెంకట్రావు, కార్యదర్శి నాగదేవి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి సర్పంచ్‌గా గారపాటి బాధ్యతలు స్వీకరణ



భాస్కరరావును అభినందిస్తున్న వలవల బాబ్జి

పెంటపాడు, మార్చి 11: కోరుమిల్లి ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా గారపాటి ఉదయ భాస్కరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆయనను అభినందించి కేకు కట్ చేయించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి ఇబ్బందిని పరిష్కరిస్తానని, సురక్షిత నీటిని అందిస్తానన్నారు. గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, గంధం సతీష్, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, పి. వెంకటేశ్వరరావు, పసల కొండ, వల్లేపల్లి గోపాలకృష్ణ, ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తొలి గురువు మాతృమూర్తి

పెంటపాడు, మార్చి 11: ప్రతి ఒక్కరికీ తొలి గురువు వారి మాతృమూర్తేనని టీబీఆర్ విద్యా సంస్థ చైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్లో సోమవారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లులకు పాదపూజ చేశారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్, ప్రిన్సిపాల్ పర్వీన్‌కుమారిశర్మ, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి



ఇళ్ళను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

తణుకు, మార్చి 11: పట్టణ పరిధిలోని అజ్జరం కాలనీలో గత ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం టిడ్కో ఇళ్ళను పరిశీలించారు. లబ్ధిదారులకు బ్యాంకులు నోటీసులు పంపుతున్నారని తెలిపారు. నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు.

ధనలక్ష్మికి అభినందన

అత్తిలి, మార్చి 11 : గుమ్మంపాడుకు చెందిన ఉడతల ధనలక్ష్మి సాధారణ గృహిణి. ఆమె ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళి వచ్చింది. కాటన్ దొర విగ్రహం కోసం విరాళం ఇవ్వాలని గ్రామస్థులు కోరడంతో రూ. 5 లక్షల విరాళం అందజేసింది. అలాగే గ్రామంలో రుద్రభూమి అభివృద్ధి నిమిత్తం రూ. లక్ష అందజేసింది. సోమవారం మంత్రి కారుమూరి కాటన్ విగ్రహాన్ని ఆవిష్కరించి దాతను అభినందించారు. సర్పంచ్ వేగేశ్న సత్యనారాయణరాజు, బల్లిపాడు సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు

అత్తిలి, మార్చి 11 : చిరుధాన్యాల్లో పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ మంచిలి సూపర్‌వైజర్ శ్రీ మహాలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం మంచిలి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, తృణధాన్యాలు వల్ల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, కృష్ణకుమారి, జ్యోతి, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు

మొగల్తూరు, మార్చి 11: ముత్యాలపల్లి పంచాయతీ గెదళ్ళవంపు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. 90 మంది పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామంలో మరో 18 విద్యార్థుల ఇళ్ళకు వెళ్ళి ఆయోడిన్ శాంపిల్స్ సేకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

ఉండి, మార్చి 11: ఎన్నికల ప్రవర్తనా నియమావళి తూచా తప్పక అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశ కార్యాలయంలో నియోజకవర్గానికి సంబంధించి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనరు తదితర అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టరు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకుని ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందన్నారు. ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మాత్రమే సంబంధిత ఆర్వోలు, ఏఆర్వోలు నామినేషన్లు స్వీకరించాలన్నారు. ప్రతీ లోక్‌సభ అభ్యర్థికి రూ.95లక్షలు, ప్రతీ శాసనసభ అభ్యర్థికి రూ.40లక్షలు మేర వ్యయం చేసేందుకు అనుమతి వుంటుందన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు అర్జునరావు మృతి



ఆకివీడు, మార్చి 11: టీడీపీ సీనియర్ నాయకుడు, రూరల్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తోట అర్జునరావు (81) సోమవారం తన నివాసంలో మృతి చెందారు. ఈయనకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు తోట బాబి రూరల్ బ్యాంకులో అసిస్టెంట్ సీఈవోగా పనిచేస్తున్నారు. పట్టణ ప్రముఖులు, టీడీపీ శ్రేణులు, వివిధ పార్టీల నేతలు, బంధువులు, రూరల్ బ్యాంకు ఉద్యోగులతో పాటు బ్యాంకు సీఈవో తోట సతీష్ నివాళులర్పించి సంతాపం తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ



మొగల్తూరు, మార్చి 11: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మక్కువ చూపాలని వ్యవసాయాధికారులు సూచించారు. సోమవారం మొగల్తూరులో నవ్యధాన్య రథ సారథులు కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పెరటిలోనూ అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలోనూ కూరగాయలు పండించాలన్నారు. ప్రకృతి సిద్ధంగా పెరిగిన కూరగాయలతో మంచి ఆరోగ్యం కలుగుతుందని అన్నారు.

స్వచ్ఛందంగా పంట కాల్వ తవ్వకం



మొగల్తూరు, మార్చి 11: దాళ్వా సాగుకు వంతు సమయంలోనూ సాగునీరు అందకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా పంట కాలువను ఎక్స్‌కవేటర్‌తో తవ్వించారు. మొగల్తూరు పంచాయతీ పరిధిలో 45 డీపీ చానల్ నుంచి దాళ్వా సాగుకు నీరందడం లేదు. రైతులకు పొట్ట దశలో ఉన్న వరికి చుక్కనీరందకపోవడంతో పొలాలు బీడువారే పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించకపోవడంతో ఆయకట్టు రైతులు ఎకరాకు కొంతమొత్తం నగదు సమీకరించి సుమారు రూ.30వేలు వెచ్చించి డీపీ చానల్ శివారు వరకూ ఎక్స్‌కవేటర్‌తో తవ్వకం పనులు సోమవారం చేపట్టారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

మొగల్తూరు, మార్చి 11: చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం మొగల్తూరులో ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా కుక్కలవారితోట, ఆదర్శనగర్ కాలనీల్లో ర్యాలీ చేసి చిన్నారులకు పౌష్టికాహారం అందించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు.

అనధికార లేఅవుట్‌లలో స్థలాలు కొనవద్దు



మొగల్తూరు, మార్చి 11: గ్రామాల్లో అనధికార లేఅవుట్‌లోని స్థలాలు కొనుగోలు చేయవద్దని పంచాయతీ కార్యదర్శి కె.జయరాజు సూచించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్‌లో పంచాయతీ సిబ్బంది ఈ స్థలాలకు పంచాయతీ అనుమతి లేదంటూ కొనుగోలు దారులకు తెలిసే విధంగా ఫ్లెక్సీలు సోమవారం ఏర్పాటు చేశారు. పంచాయతీ ఏర్పాటు చేసిన హెచ్చరికలు పట్టించుకోకుండా ఎవరైనా స్థలాలు కొనుగోలు చేస్తే వారికి పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు లభించవన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 11 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని 50 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించగా జనరల్ విద్యార్థులు 313 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 86 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎటువంటి కాపీయింగ్, ఇబ్బందులు గాని పరీక్షా కేంద్రాలలో తలెత్తలేదని ఎగ్జామ్స్ కన్వీనర్ చంద్రశేఖర్ బాబు తెలిపారు.

కార్మికుల లబ్ధి పై సామాజిక తనిఖీ

ఆచంట, మార్చి 11: భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి ద్వారా పెళ్ళి కానుక, మెటర్నిటీ, సహజ మరణాలు నిమిత్తం 52 మంది లబ్ధిదారులకు రూ. 9 లక్షల 90 వేలు ఖర్చు చేయగా వాటిని సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పి బి.సూర్య ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా వేదిక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పీవీవీ ఆదినారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.